


# లలిత విస్తరం

[ అనువాదకులు: తిరుమల రామచంద్ర, బులుసు వేంకట రమణయ్య. ప్రాప్తిస్థానం: శ్రీ బులుసు వేంకట రమణయ్య, 34, పురుషోత్తమనగర్, మద్రాసు—44. వెల: రు. 12—50. ]

'లలిత విస్తరం' అన్నది మహాయాన బౌద్ధ గ్రంథం. అన్నిమతాలూ సాంఘికపరిస్థితులలో కలిగేమార్పును బట్టి తాము కూడా మారుతూ, విభజన ద్వారా పెరుగుతూ వచ్చాయి. బౌద్ధానికీ ఈ గతి తప్పలేదు. హీనయానమూ, మహాయానమూ, వజ్రయానమూ మొదలైన పరిణామాలు ఏర్పడ్డాయి. బౌద్ధంలోకి విగ్రహారాధనా, తాంత్రిక వామాచార పద్ధతులూ మొదలైనవి ప్రవేశించాయి. బుద్ధుడు జన్మించేనాటికి సంఘవ్యవస్థ రాజకీయ వ్యవస్థగా మారుతున్నదనీ, శిథిలమవుతున్న సంఘ వ్యవస్థల పునాదిమీద బుద్ధుడు తన బౌద్ధ సంఘాలను నిర్మించి వాటికి బలం చేకూర్చాడనీ విజ్ఞులు చెబుతారు.

లలిత విస్తరం పుట్టేనాటికి — ఆ మాటకు వస్తే బుద్ధుడు జీవించి ఉండగానే — సామ్రాజ్యాల విస్తరణా, అతి భయంకరమైన రక్తపాతమూ, గణసంఘాల మారణహోమమూ జరిగాయి. చక్రవర్తిత్వం ఆమోదయోగ్యమయింది. అశోకుడు కూడా మగధ సామ్రాజ్యాన్ని స్థాపించాక, దాన్ని రక్షించుకునేందుకు "బుద్ధం శరణం గచ్ఛామి" అనవలసివచ్చింది. అంటే, గణ సంఘాలపై ఆదరణ ప్రజలలో (సామ్రాజ్యానికి బానిసలు చేయబడిన వారిలో) అంత ప్రగాఢంగా ఉన్నదన్నమాట.

మూర్ధాభిషిక్తుడైన రాజు "చక్రరత్న సమన్వితుడు" అంటే చక్రవర్తి ఎలా అవుతాడో చరిత్రనుంచి మనం తెలుసుకోగలుగుతున్నాం. అజాతశత్రువు వజ్జియను గణాలను ధ్వంసంచేసిన విధానం ఈ నాడు వియత్నాంలో అమెరికనులు అనుసరించే విధానానికి భిన్నంగా ఉన్నట్టు కనబడదు. అశోకుడి కళింగ విజయం అందరూ ఎరిగినదే. కాని 'లలిత విస్తరం' చక్రవర్తి ఎలా అవుతాడో చెబుతున్నది, వినండి:

"మూర్ధాభిషిక్తుడైన, క్షత్రియుడైన రాజు ప్రాతఃకాలంలో ... లేచి, శిరఃస్నానం చేసి, ఉపవాసంతో ప్రాసాదోపరి భాగానికి ... వెళ్ళినప్పుడు పూర్వదిక్కున దివ్యమైన చక్రరత్నం ప్రాదుర్భవిస్తుంది... మూర్ధాభిషిక్తుడైన రాజు... కుడిచేయి ఎత్తి, 'ఓ భట్టారకా, దివ్య చక్రరత్నాన్ని ధర్మంతో ప్రవర్తింపజెయ్యి...' అని ప్రార్థిస్తూ నివేదించాలి. అప్పుడు ఆ చక్రరత్నం మూర్ధాభిషిక్తుడైన రాజుతో ... ఉత్తమ బుద్ధి మార్గంలో పూర్వాకాశంలో వెళ్తుంది. చక్రవర్తి అయిన రాజు చతురంగ బలాలతో దానిని అనుసరిస్తాడు. తర్వాత పూర్వదిక్కున ఉన్న మండలేశ్వరులైన రాజులు ... ఆ చక్రవర్తి అయిన రాజుకు ఎదురేగి ... 'దేవా! దయచేయు ... ఈ రాజ్యం మీకు జయం వల్ల ప్రాప్తించింది. దీనిలో మీరు వసించండి!' అని విన్నవిస్తున్నారు ... తాత అయిన ఆ మూర్ధాభిషిక్తుడు ఆ మండలేశ్వరులైన రాజులతో ఇలా అన్నాడు: "మీరంతా మీ మీ రాజ్యాలను ధర్మంతో పాలించండి. అయ్యో! మీరు ప్రాణివధ చెయ్యకండి. ఈ విధంగా మూర్ధాభిషిక్తుడైన రాజు పూర్వదిక్కునుజయిస్తాడు..." ఇదేవిధంగా (!) దక్షిణ, పశ్చిమ, ఉత్తర దిక్కులను జయించి కొంప చేరుకుంటాడు!

ఎక్కడా యుద్ధ ప్రసక్తి లేదు, రక్తపాతం లేదు. బౌద్ధ సంఘాలలో వర్గ వివక్షతలు లేవు కాని ఈ చక్రవర్తి క్షత్రియుడే అవుతున్నాడు!

బుద్ధుడు పుట్టినప్పుడు చక్రవర్తి అయ్యే లక్షణాలున్నాయన్నారు. లలిత విస్తరం నాటికి సామ్రాజ్యాలుండటమే అందుకు కారణం కావచ్చు. అమెరికాలోని ఆదిమవాసులను జయించిన స్పానియర్డ్‌లు రాజరికం ఎరిగినవారు, గణజీవితం అర్థంచేసుకోలేనివారు. ఆ కారణంగా అమెరికను ఆదిమజాతులలో రాజులూ, చక్రవర్తులూ ఉండేవన్నట్టు రాశారు. గణజీవితంలో రాజులకూ, చక్రవర్తులకూ ఆస్కారంలేదని మోర్‌గన్ రుజువు చేశాడు. బుద్ధుడి కాలంనాటికి రాజకీయజీవితం లేదన్న అభిప్రాయమూ, సామ్రాజ్యాలింకా ఏర్పడలేదన్న అభిప్రాయమూ సరి అయిన వైతే, లలిత విస్తరంలో కూడా ఇలాటి పొరపాటే జరిగింది.

సాంఘిక పరిణామ ప్రభావం మరో విధంగా కూడా కనిపిస్తుంది. "ప్రత్యంత జనపదాలు" అనాదరణకు గురి అయాయి. అవి అంధులకూ, జడులకూ, మూఢులకూ ఆకరాలయాయి. అందుచేత "బోధిసత్త్వులు ప్రత్యంత జనపదాలలో జన్మించారు ... మధ్య జనపదాలలోనే జన్మిస్తారు."

మరి కొంతకాలం గడిచాక రచించి ఉంటే, బోధిసత్త్వులు మహా నగరాలలోనే జన్మిస్తారని లలిత విస్తరం చెప్పి ఉండేదా?

ఇంతేకాదు, బోధిసత్త్వులు బ్రాహ్మణ క్షత్రియ కులాలలో తప్ప "హీనకులాలలో" జన్మించరా? బ్రాహ్మణులు గురువులుగా ఉన్నప్పుడు బ్రాహ్మణకులంలోనూ, క్షత్రియులు గురువులుగా ఉన్నప్పుడు — ఈ పరిస్థితి ఛాందోగ్యోపనిషత్తులో కనబడుతుంది — క్షత్రియ కులంలోనూ జన్మిస్తారు! బుద్ధుడు పుట్టినప్పటికి క్షత్రియులు గురువులు. అందుకే బుద్ధుడు ఆ కులంలో జన్మించాడన్నమాట. మరి జాతక కథలలో బోధిసత్త్వుడు కాకిగానూ, కుక్కగానూ జన్మించాడే! దాని మాటేమిటి?


ఇలా శంకలు లేవదీస్తూ పోతే ఎంత గ్రంథమైనా అవుతుంది. బుద్ధుడి వాస్తవ జీవిత కథగా లలిత విస్తరానికి ఏమీ విలువ ఇవ్వనవసరంలేదు. దీని ఆధారం మీద "లైటాఫ్ ఏషియా" రాసిన ఆర్నాల్డ్ కూడా బుద్ధుడనేవాడు పుట్టాడన్నదీ, కొంతకాలం జీవించి చనిపోయాడన్నదీ తప్ప మిగిలిన ఏ అంశానికీ చారిత్రిక ప్రాముఖ్యం లేదనేశాడు. ఇది మహాయాన బౌద్ధపురాణం. అన్ని పురాణాలూ ఎంత విశ్వసనీయమైనవో, ఇదీ అంతే. కాకపోతే అనువాదకులు అన్నట్టు, ఇందులో అనేక ఇతర విషయాలున్నాయి. పరిశోధకులకు అవి ఎంతగానో ఉపకరిస్తాయి.

ఇందులో చక్కని ప్రవేశిక ఉన్నది. బౌద్ధం ఎలాటి పరిణామాలు చెందినదీ ఇందులో చక్కగా వివరించబడింది. మతాలన్నీ భౌతిక సామాజిక వ్యవస్థనుంచే పుట్టాయంటే పోట్లాడే వాళ్ళున్నారు. అలాటివాళ్ళు కూడా సామాజిక పరిణామం మతాలమీద ఎలా పని చేసినదీ అంగీకరించక తప్పదు. అన్ని మతాలు సుఖాన్ని ఎరగా చూపాయి. బౌద్ధం దీనికి భిన్నంకాదు. బుద్ధుడు జీవితం దుఃఖమయమని తెలుసుకుని ఆ దుఃఖంనుంచి మనుషుల మనసుకు విముక్తి పొందించటానికి ఒక మతాన్ని సృష్టించాడు. ఈ లోకంలో సుఖాలు చూపించలేని సాంఘిక పరిస్థితిలో స్వర్గమూ, ఉత్తమ లోకాలూ సృష్టి అయి జనాన్ని వంచించాయి. కాని తిరిగి ప్రజల దృష్టి ఇహసుఖాలకేసి మళ్ళుతున్నది. ఈనాడు ఐహిక సుఖాలిచ్చే దేవుళ్ళకూ, బాబాలకూ గిరాకీ హెచ్చింది. మోక్షం ఇచ్చే దేవుళ్ళు మరుగైనారు. ఇదీ సాంఘిక పరిణామ ఫలితమే మరి.

—కొ. కు.

ప్రపంచపు అత్యద్భుతమైన

గృహ సినిమా ఆనందాన్ని పొందండి



మీ అభిమాన ఫిలిం తారలు తెర మీద రంగు రంగులతో శృంగారంలో, హాస్యంలో, పోరాటంలో, కార్టూన్ల సినిమాలోనే కలకలలాడుతూ, నాట్యంచేస్తూ ఉండే దృశ్యాలను 4'–3' తెరమీద ఎలెక్ట్రిసిటీ లేక బ్యాటరీతో సంతలలోను, ప్రదర్శనాలలోను ప్రదర్శించి ఆనందించండి. బ్రహ్మాండంగా డబ్బు గడించండి. లేదా ఇంటి వద్ద మిత్రులకు, కుటుంబానికి చూపండి. సూపర్ స్పెషల్ ప్రొజెక్టర్ 100 అడుగుల ఉచిత ఫిలిం స్క్రీన్, ఫిలిం ఉన్నతో, రు. 45/-లు. పోస్టేజి, ప్యాకింగుకు రు. 6—50 లు అదనం. అదనపు 100 అడుగుల ఫిలిం రు. 10/-లు.

గొప్ప గిరాకీ. నేడే ఆర్డరివ్వండి.

AMERICAN CINEMA SUPPLIES,
Kalyanpura, Delhi-6.

Printed and Published on behalf of Andhra Prabha Private Ltd. by M. KRISHNASWAMI, B.A., B.L. at the Dinamani Press, Express Estates, Madras-2. Editor: P. NAGESWARARAO.